క్లుప్తంగా

బాలకృష్ణ ప్రసాద్ మరణం తీరనిలోటు



అప్పటి కలెక్టర్ గిరిధర్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అభినవ అన్నమయ్యగా పేరొందిన బాలకృష్ణ ప్రసాద్ మరణం కళాభిమానులకు తీరని లోటు అని చిత్తూరు కల్చరల్ అకాడమీ కార్యదర్శి రాజశేఖర్ నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తన వైభవం కార్యక్రమాలను నిర్వహించి చిత్తూరు ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. అప్పటి కలెక్టర్ గిరిధర్ బాలకృష్ణ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారని ఆయన పేర్కొన్నారు.

కబ్జా చేస్తున్నారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రెవెన్యూ అధికారుల అండతో తమ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని తమిళనాడు రాష్ట్రం కాట్పాడికి చెందిన విజయన్ ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరుకు చెందిన రావుబాదురు గొల్ల గుర్రప్ప నాయుడు తన ఆస్తులకు సంబంధించి జీపీఏను చట్టపరంగా తన పేరిట ఇచ్చారని తెలిపారు. ఈ భూములు తాను సాగు చేసేందుకు వెళుతుంటే కొందరు వచ్చి ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. మంగ సముద్రం, తేనెబండ, తిమ్మసముద్రం గుర్రప్ప నాయుడు కాలనీ, కొంగారెడ్డి పల్లె, పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో విలువైన భూములు ఉన్నాయన్నారు. ఈ భూములను అధికారులు పరిరక్షించి తనకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో భారత్ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 90 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. వడదెబ్బకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు


విద్యావాణి సంచిక అభినందనీయం



మంగళ విద్యావాణి 34వ సంచికను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి మంగళవిద్యావాణి సంచికను అమలు చేయడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మంగళవిద్యావాణి 34వ సంచికను జేసీ ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ బంగారుపాళెం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళ విద్యావాణి సంచికను అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ మాసపత్రిక పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పాఠశాలలో మాసపత్రికను నిర్వహిస్తూ విద్యార్థులతో రచనలు చేయడం గర్వకారణమన్నారు. తమ వంతు సాయంగా పాఠశాల అభివృద్ధికి రూ.15 వేలు విలువ చేసే పుస్తకాలు అందజేస్తామని జేసీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, మాసపత్రిక నిర్వాహకులు, గణిత ఉపాధ్యాయులు అరుణశివప్రసాద్, టీచర్లు భారతి, సంపంగి పాల్గొన్నారు.

నాటుతుపాకీ కేసులో వ్యక్తి అరెస్టు



బంగారుపాళెం: నాటుతుపాకీ కేసులో ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెలుతురుచేను పంచాయతీ పులిమడుగు గ్రామానికి చెందిన కాశీ(40) అడవి జంతువులను వేటాడేందుకు నాటుతుపాకీతో వెళుతుండగా గుర్తించి నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సచివాలయం నిర్వీర్యం

దేశానికి వెన్నెముక పల్లెసీమలైతే, గ్రామాలకు పట్టుగొమ్మలుగా సచివాలయాలు సేవలందించాయి. అయితే వీటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకురావడంతో, ఆ పార్టీకి పేరొస్తుందన్న ఉద్దేశంతో, వాటిని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులను చిందర వందర చేసినట్లుగా ఎక్కడబడితే అక్కడకు బదిలీచేసింది. ఇప్పుడు సచివాలయాలను కుదించేసే పనిలో నిమగ్నమైంది. రెండు సచివాలయాలను విలీనం చేసేందుకు అధికార యంత్రాంగం నివేదికలు రూపొందిస్తోంది. ఫలితంగా గ్రామస్తులకు అందుబాటులో ఉన్న సేవలను దూరం చేసి, అవస్థలకు గురిచేస్తోంది.



గ్రామ సచివాలయం

- రెండు సచివాలయాలు ఒకటిగా విలీనానికి సిద్ధం
- నివేదికలు తయారుచేస్తున్న అధికారులు
- ప్రజలకు దూరం కానున్న సేవలు

గుడిపాల: గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాలనే మంచి ఆశయంతో గ్రామస్వరాజ్య సాధన దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో 530 రకాల సేవలు సకాలంలోనే అందుతుండేవి. ప్రజలు మండల కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాలన గడప వద్దకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలు కన్న సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి. ఇకపై రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీడీవోలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా చర్చలు చేస్తున్నారు. రెండు సచివాలయాలు ఉన్నచోట ఒకటి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఒక్క గ్రామానికే సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటిని సమీపంలోని మరొక సచివాలయానికి అనుసంధానం చేయనున్నారు. కొన్నిచోట్ల మాత్రం సచివాలయాలు లేకుండా చేస్తే ప్రజలు సుదూరంగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి వాటిని ఎలా చేయాలనే దానిపై అధికారులు ఆలోచిస్తున్నారు. నియోజకవర్గంలో 26 సచివాలయాలు ఉన్నాయి. విలీనం అయితే సగానికి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉద్యోగుల సంఖ్య తగ్గనుంది

సచివాలయాల్లో 11మంది ఉద్యోగులు ఉన్నచోట వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కుదించే చర్యలు జరుగుతున్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్‌ఓ, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్ తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో ప్రధానంగా వెల్ఫేర్, వీఆర్‌ఓ, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌తో మొత్తం తొమ్మిదిమంది మాత్రమే పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖలకు బదలాయింపు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రజలకు తప్పనితిప్పలు

సచివాలయాలను విలీనం చేయనుండడంతో వివిధ రకాల సేవలకోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఊర్లలోనే సేవలు పొందే గ్రామస్తులు ఇకపై వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడనున్నాయి. కనీసం నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. పనులు మానుకొని సచివాలయాలకు వెళ్లినా అక్కడ సిబ్బంది ఉంటారా.. లేక ఫీల్డ్ విజిట్ అంటూ కనిపించకుండా పోతారా తెలియని పరిస్థితి నెలకొంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఊర్లలోనే పనులు చేసుకుని తీరిగ్గా సచివాలయాల్లో సేవలు పొందే వాళ్లమని అభిప్రాయపడుతున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేసే మహిళా కూలీలకు వేతనాలు పురుషులతో సమానంగా ఇవ్వాలని చిత్తూరు గ్రామీణ మండలం వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు అరవింద్, మనోహర్ అన్నారు. చిత్తూరు నగరంలోని తహసీల్దార్ లోకేశ్వరిని వారు సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేసే కూలీలకు కనీసవేతనంగా రూ.850 ఇవ్వాలన్నారు. మహిళా కూలీలకు ఉచిత ప్రయాణ ఏర్పాట్లు చేయాలన్నారు. పనిచేసే చోట కనీస వసతులు కల్పించాలని చెప్పారు. పనికెళ్లే సమయంలో మహిళలపై జరిగే బెదిరింపులు, వేధింపులు, హింసను అరికట్టాలని వారు కోరారు.

అవని పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రఘుబాబు

గుడిపాల: అవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గిరింపేట డీసీసీ బ్యాంక్ మేనేజర్ రఘుబాబు తెలిపారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా డిపాజిట్‌కు 7.8శాతం ఇస్తారని చెప్పారు. అవని పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా డిపాజిట్లపై 8.30శాతం వడ్డీ ఇస్తామన్నారు. మహిళ సీనియర్ సిటిజన్ అయితే 8.40 శాతం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ డిపాజిట్ కాల పరిమితి 333 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి వసూలు చేయాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ ఇన్‌చార్జ్ కుమార్, సీఈఓ పట్టాభి, సిబ్బంది సెల్వం, జయరాజ్, జితేంద్ర పాల్గొన్నారు.

వేగంగా వినతుల పరిష్కారం

చిత్తూరు అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే వినతులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం నాటి పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఇంజినీరింగ్ 8, పబ్లిక్ హెల్త్ -2, టౌన్ ప్లానింగ్ -2, రెవెన్యూ -1 చొప్పున మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డా. లోకేష, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ఇంటింటికీ వైద్య సేవలు

తవణంపల్లె: ఇంటింటికీ వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 32 మంది రోగులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె చెరువులో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని పల్లె చెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులకు, చిన్నారులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గోవిందరెడ్డిపల్లెలో రోగులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గుడిపాల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ పౌష్టికాహారాన్ని తీసుకున్నప్పుడే పిల్లల ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. అనంతరం పండ్లు, బ్రెడ్, అరటిపండ్లను పంపిణీ చేశారు. సిబ్బంది జబసెల్వి, విజయ, ఉమామహేశ్వరి, నాగలక్ష్మి, అనిత, సోని, వెంకటేష్ పాల్గొన్నారు.



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సంధ్య

యువత పోరును జయప్రదం చేయాలి

- విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం చెలగాటం
- మీడియా సమావేశంలో సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం సాయంత్రం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్సుమెంట్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకాన్ని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పటిష్టంగా అమలు చేశారని అన్నారు. కరోనా కష్ట కాలంలోనూ విద్యార్థులకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విద్యార్థుల తల్లుల ఖా తాల్లోకి జమచేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై అప్పుడే చేతులెత్తేసిందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడంలేదని అన్నారు. విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటం తప్పదని చెప్పారు. ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని యువకులు, నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, సీనియర్ నాయకులు ప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మ న్ దత్తాత్రేయ రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, వైద్య విభాగం అధ్యక్షులు మణిరాజ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు, నాగరాజ, నాయకులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

12న యువత పోరును విజయవంతం చేద్దాం

ఐరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ న్విహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కురుణాకర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రజలిచ్చే అర్జీలను పరిశీలించి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రోడ్డు తగాదాలు, పట్టాదారు పాసుపుస్తకం, మార్పులు, చేర్పులు, సర్వే, రేషన్‌కార్డు తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 22 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా.. ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన సూచించారు.

ప్రజాస్వామ్యం నవ్వులపాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తల నాయకురాలు సుజిని మండిపడ్డారు. చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం విజయవాడకు బయలుదేరిన కార్యకర్తలను అరెస్టులు చేయడం, నిర్బంధించడం దారుణమన్నారు. సీఐటీయూ నాయకులు కోదండయ్య, గంగరాజులు, సురేంద్రన్ మా ట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నో హామీలిచ్చారన్నారు. జీతాలు పెంచుతామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని చెప్పారు. దీనిపై విజయవాడలో పోరాటం చేయడానికి వెళుతుంటే కార్యకర్తలను అడ్డుకోవడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభు త్వం కార్యకర్తల ఉసురు పోసుకోకుండా న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్, రమాదేవి, దాసరి చంద్ర, అని, జయంతి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్యకర్తలు

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

ఐరాల: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా పీహెచ్‌సీలో గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తామన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రసవ సమయంలో రక్తం 12 గ్రాముల పైన ఉండాలని, అంతకంటే తగ్గిన వారికి ఆస్పత్రిలో ఐరన్ మాత్రలు ఇవ్వడంతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్ ఉన్నవారికి మందులు, ఆరోగ్య సలహాలు ఇస్తామని తెలిపారు. రక్తహీనత తలెత్తకుండా పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దందాలకు బ్రాండ్ అంబాసిడర్

- ఆ నాయకుడంటేనే హడల్!
- అతని గుప్పెట్లో రేషన్‌షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఆ అధ్యక్షుడిపై పార్టీకి ఫిర్యాదుల పరంపర

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమికి చెందిన ఒక పార్టీ మండలాధ్యక్షుడు ప్రజలను, అధికారులను హడలెత్తిస్తున్నాడు. దందాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందాడు. రౌడీలా వ్యవహరిస్తూ అందరినీ బెదిరిస్తున్నాడు. అన్ని శాఖలను గుప్పెట్లో పెట్టుకొని మండలాన్ని శాసిస్తున్నాడు. అడ్డొస్తే అధికారం చూపుతున్నాడు. రేషన్‌షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులు మొత్తం ఇతని చేతుల మీదుగానే జరగాలని శాసనం చేశాడు. సొంత లెటర్ ప్యాడ్‌తో అధికారులపై పెత్తనం చేస్తున్నాడు.

చిత్తూరు మండలానికి చెందిన ఆ నాయకుడి తీరు కూటమి ప్రభుత్వానికి మచ్చని తెచ్చిపెడుతోంది. మండలానికి అన్నీ తానేనంటూ కొందరిని వెంటేసుకుని దందాలు చేస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే వీరంగం చేస్తున్నాడు. తొలుత ఇసుక వ్యాపారంపై కన్నేసి దోపిడీ ఆరంభించాడు. బీఎన్‌ఆర్‌పేట రీచ్ నుంచి ఇసుకను చీకటి వేళ తరలించేశాడు. పది మందిని వెంటబెట్టుకుని రాత్రి పూట అటువైపు ఎవరినీ రానీయకుండా అందరినీ భయపెట్టేవాడు. అలా కొన్నాళ్ల వరకు తమిళనాడుకు ఇసుక తరలించాడు. దీనిపై ప్రజాప్రతినిధికి ఫిర్యాదు వెళ్లడంతో ఓ రాత్రి రీచ్‌లో ఉన్న దొంగలను పరుగెత్తించారు. అప్పటికీ దందా ఆగకపోవడంతో ఆ పార్టీలోని కొందరు అధికారులకు ఉప్పందించారు. దీంతో అధికారులు అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఉచితం అనే సరికి ఆ అధ్యక్షుడికి పట్ట పగ్గాలు లేవు. ఉచితం మాటున ఇసుక దందాను నడిపిస్తున్నాడు. మద్యం కొత్త పాలసీ వచ్చే సరికి చెక్‌పోస్టు, సొంత గ్రామంలో బెల్టుషాపులు పెట్టేశాడని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చెబుతున్నాయి.

సిఫార్సు ఉంటేనే...

పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అడ్డగోలుగా రేషన్‌షాపు డీలర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇలా పలు శాఖల్లోని చిరుద్యోగుల కడుపుకొట్టారు. వారి స్థానంలో కూటమిలోని ఆ అధ్యక్షుడికి అనుకూలంగా ఉన్నవారికి పదవులు కట్టబెట్టాడు. దీనికి దక్షిణగా ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.50వేలు పుచ్చుకున్నాడనే ఆరోపణలున్నాయి. ఉద్యోగం దక్కిన తర్వాత కూడా చేసే పనుల్లో కొంత మేర ఆ అధ్యక్షుడికి వాటా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి సరే అంటేనే తాను సిఫార్సు లేఖ ఇస్తానంటూ బేరసారాలు నడిపించాడు. అలాగే గ్రామాల్లోని ఆ పంచాయతీలన్నీ కూడా తనవద్దకే రావాలని నిబంధన పెట్టాడు. పల్లెల్లో వచ్చే భూ సమస్యలు, గొడవలను సర్దుబాటు చేస్తూ జేబులు నింపుకుంటున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ఫిర్యాదులన్నింటినీ ఇతన్నే సెటిల్‌మెంట్ చేసి పంపేస్తున్నాడు.

భయపెట్టడమే అజెండా

భయపెట్టడమే అజెండాగా ఆ అధ్యక్షుడు ముందుకు వెళుతున్నాడు. అతనికి కానీ..అతని కోవర్టులకు కానీ అడ్డొస్తే.. బెదిరించడమే పనిగా పెట్టుకుంటున్నాడు. ఆ వర్గం చేసే పనికి అధికారులకు ఫిర్యాదు చేసిన వ్యక్తిని చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. ఇతడి వర్గం చేసే అక్రమాలకు సంబంధించి వార్తా పత్రికల్లో కథనాలొస్తే...ఆ విలేకరులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

ఆ అధ్యక్షుడి మార్పునకు రంగం సిద్ధం?

ఆ అధ్యక్షుడు చేసే దందాను మండలంలోని పలువురు నేతలు ఎప్పటికప్పుడు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నారు. డబ్బులిస్తే..అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నాడని, దీంతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందని పార్టీ పెద్దలకు పదే పదే వివరిస్తున్నారు. రేషన్, షాపు, ఫీల్డ్ అసిస్టెంట్, భూ సెటిల్‌మెంట్ల వ్యవహారాన్ని వివరంగా తెలియజేశారు. దీంతో ఆ అధ్యక్షుడిని మార్చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ అధ్యక్ష పదవికి కమ్మ సామాజిక వర్గంలో ఇద్దరు, ఎస్సీ సామాజిక వర్గంలో ఓ నేత పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.

బెల్టుషాపులపై దాడి..

తవణంపల్లె: మండలంలోని రెండు బెల్ట్ షాపులపై దాడులు చేసి, 42 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. జోగివారిపల్లెలో సుకేష్ అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడులు చేశారు. అతడి వద్ద నుంచి 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.